PSBH

తొలి స్వాతంత్ర్య సమరయోధుడు

# టిపు సుల్తాన్



ఎస్. వెంకట్రావు

# తొలి స్వాతంత్ర్య సమరయోధుడు

# టిప్పు సుల్తాన్

రచన

**ఎస్. వెంకట్రావు**

**ప్రజాశక్తి బుక్‌హౌస్**

ప్రజాశక్తి భవన్, అమరారెడ్డి నగర్, అరవిందా హైస్కూల్ వద్ద

తాడేపల్లి - 522 501. ఫోన్ : 0866 - 2577533

ప్రథమ ప్రచురణ : జులై, 2021

ప్రతులు : 500

వెల : 20/-

**ప్రతులకు**

PSBH

**ప్రజాశక్తి బుక్‌హౌస్**

27-1-54, కారల్‌మార్క్స్ రోడ్, గవర్నర్‌పేట,

విజయవాడ -2, ఫోన్ : 0866 -2577533

**బ్రాంచీలు**

విజయనగరం, విశాఖపట్నం, కాకినాడ, ఏలూరు, విజయవాడ,

గుంటూరు, ఒంగోలు, నెల్లూరు, తిరుపతి, కర్నూలు, అనంతపురం

**ముద్రణ**

ప్రజాశక్తి డైలీ ప్రింటింగ్ ప్రెస్, విజయవాడ

website : www.psbh.in

prajasaktipublishinghouse@gmail.com

152158

# తొలి స్వాతంత్ర్య సమరయోధుడు

**భా**రత దేశంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదుల ఆధిపత్యానికి వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడుతూ నేలకొరిగిన మొట్టమొదటి స్వాతంత్ర్య పోరాట యోధుడు టిపు సుల్తాన్. ఆయన అసలు పేరు సుల్తాన్ ఫతే ఆలి సాహబ్ టిపు. మైసూర్ టైగర్ గా పేరు గాంచిన టిపు సుల్తాన్ 1782లో తండ్రి హైదర్ ఆలి మరణంతో మైసూర్ రాజుగా పదవీ బాధ్యతలు స్వీకరించి 17 ఏళ్ల పాటు ప్రజారంజకంగానూ, బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీని భారత భూభాగం నుండి తరిమికొట్టడమే లక్ష్యంగానూ పరిపాలన సాగించాడు. బ్రిటిష్ వారికి సింహస్వప్నమయ్యాడు. టిపు సుల్తాన్ యుద్ధ వీరుడే కాదు, మంచి పాలనా దక్షుడు, పలు భాషల్లో ప్రావీణ్యం కలిగిన మేధావి, కవి.

ఫ్రెంచ్ విప్లవంతో యూరప్‌లో వ్యాపించిన ఆధునిక లౌకిక భావజాలాన్ని భారత దేశంలో ప్రవేశపెట్టడానికి ప్రయత్నించిన మొదటి పాలకుడు టిపు సుల్తాన్. పరిపాలనా రంగంలో ఆయన తీసుకువచ్చిన సంస్కరణలు, ఆయన ప్రవేశ పెట్టిన ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, పారిశ్రామిక, వాణిజ్య రంగంలో తీసుకు వచ్చిన ఆధునిక పోకడలు, యుద్ధ సాంకేతిక రంగంలో ఆయన తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పులు మైసూరు రాజ్యాన్ని ఆనాడు భారత దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే అత్యంత ఉన్నతమైన స్థానంలో నిలిపాయి. ఆయన మైసూరు రాజ్యంలోని వివిధ ప్రాంతాల్లోనే కాకుండా మస్కట్ (ప్రస్తుత ఒమన్ రాజధాని), జెడ్డా (సౌదీ నగరం), బస్రా (ఇరాక్ నగరం), పెగు (మ్యాన్మార్)లలో కూడా వాణిజ్య, పారిశ్రామిక కేంద్రాలు నెలకొల్పాడు.  పాలనా రంగంలో ఆయన అనేక సంస్కరణలు ప్రవేశపెట్టాడు. జాగీర్దారీ వ్యవస్థను రద్దు చేయడం అందులో ఒకటి.

యూరప్‌లో విస్తరిస్తున్న అనేక పెట్టుబడిదారీ విధానాలను ముఖ్యంగా ఆనాటికి ఊహలకు కూడా అందని ప్రభుత్వ పెట్టుబడి పద్ధతులను టిపు తన రాజ్యంలో ప్రవేశ పెట్టాడు. ఈ రోజున కర్నాటకలో ఒక పరిశ్రమగా రూపు దిద్దుకున్న మైసూర్

సిల్క్‌కు బీజం వేసింది టిపు సుల్తానే. ఆయన బెంగాల్‌లో పట్టు పరిశ్రమను అధ్యయనం చేసి మైసూర్‌లో ప్రవేశపెట్టాడు. టిపు తన సైన్యంలో ఇనుప గొట్టాలతో కూడిన రాకెట్లు ప్రవేశపెట్టాడు. ఆనాడు బ్రిటిష్ వారి వద్దనే కాదు మొత్తం ఐరోపాలో అటువంటి రాకెట్ టెక్నాలజీ ఉండేది కాదు. భారత మాజీ రాష్ట్రపతి, భారత రాకెట్ టెక్నాలజీ నిర్మాతల్లో ఒకరు అయిన డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలామ్ 1991 నవంబర్ 30న బెంగళూరులో జరిగిన ఒక సదస్సులో మాట్లాడుతూ “టిపు సుల్తాన్ ప్రపంచ మొదటి యుద్ధ రాకెట్ ఆవిష్కర్త” అని కొనియాడారు. ఆనాడు దేశంలోని ఇతర రాజులంతా వాణిజ్యం కోసం నౌకలను ఉపయోగిస్తూ ఉంటే టిపు సుల్తాన్ మొట్టమొదటి సారిగా యుద్ధ నౌకాదళాన్ని తయారు చేసి బ్రిటిష్ వారితో పోరాడాడు. బహుశా భారత దేశ పాలకుల్లో టిపు సుల్తాన్, ఆయన తండ్రి హైదర్ ఆలీ బ్రిటిష్ వారిని గడగడ లాడించినంతగా మరే పాలకుడూ చేయలేదు. భారత దేశాన్ని స్వాధీనం చేసుకోవాలన్న బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీ ప్రయత్నాలను తండ్రీ కొడుకులిద్దరూ దాదాపు రెండు దశాబ్దాల పాటు సాహసోపేతంగా నిలువరించారు. అందుకే బ్రిటిష్ పాలకుల దృష్టిలో టిపు సుల్తాన్ ఒక విలన్‌గా మారిపోయాడు. ఆనాడు టిపు చేతిలో పరాభవం పాలైన బ్రిటిష్ సైనికాధికారులు, చరిత్ర రచయితలు అనేక వక్రీకరణలతో ఆయన పరిపాలన గురించి రాశారు. రాజులు, రాజ్యాల మధ్య జరిగిన యుద్ధాలకు, ప్రజల మరణాలకు మతం రంగు పులిమి టిపును భారతీయుల్లో అపఖ్యాతి పాలు చేయడానికి ప్రయత్నించారు. అయితే స్వాతంత్ర్యానంతరం అనేక మంది చరిత్రకారులు భారత దేశ చరిత్రలో టిపు సుల్తాన్ నిర్వహించిన అమోఘమైన పాత్రను వెలికి తీశారు. తన కాలానికన్నా ముందుగా ఆలోచించి అనేక సంస్కరణలు చేపట్టిన టిపు సుల్తాన్ బ్రిటిష్ వారు దేశంలోకి చొరబడితే జరిగే పరిణామాలను కూడా ముందుగానే ఊహించగలిగాడు. అందువల్లనే ఆ సామ్రాజ్యవాద శక్తిని నిలువరించడానికి ప్రాణాలను కూడా పణంగా పెట్టి పోరాడాడు. చివరికి శత్రువుకు వెన్ను చూపించకుండా పోరాడుతూ యుద్ధ రంగంలోనే నేలకొరిగాడు. అటువంటి దేశభక్తుని గురించి రేఖా మాత్రంగా తెలుసుకుందాం.

## టిపు సుల్తాన్ బాల్యం

టిపు సుల్తాన్ 1750లో ప్రస్తుత బెంగళూరు నగరానికి 30 కిలో మీటర్ల దూరంలోగల దేవనహళ్లిలో జన్మించాడు. ఆయన అసలు పేరు సుల్తాన్ ఫతే ఆలి సాహబ్. ఆర్కాట్‌కు చెందిన సూఫీ మత పెద్ద టిపు మస్తాన్ ఔలియాపై భక్తితో ఆయన పేరుకు టిపు అని తగిలించడంతో టిపు సుల్తాన్ అయ్యాడు. టిపు తండ్రి హైదర్ ఆలీ మైసూర్ సంస్థానంలో సైనికాధికారి. ఒక్కో మెట్టు పైకి ఎక్కి 1761లో

హైదర్ మైసూర్ రాజు అయ్యాడు. టిపు తల్లి ఫాతిమా ఫక్రున్నిసా ఆంధ్ర ప్రదేశ్ లోని కడప కోట గవర్నర్ అయిన మిర్ ముయినుద్దీన్ కుమార్తె. హైదర్ చదువుకోలేదు కాబట్టి తన కుమారునికి మంచి చదువు చెప్పించాలని ప్రత్యేక ఉపాధ్యాయులను నియమించి ఉర్దూ, పర్షియన్, అరబిక్, కన్నడ భాషలు నేర్పించాడు. ఖురాన్, ఇస్లామ్ ధర్మంలో టిపు లోతైన అధ్యయనం చేశాడు. వాటితోబాటు గుర్రపు స్వారీ, షూటింగ్, కత్తిసాము వంటి యుద్ధ విద్యలు నేర్చు కున్నాడు. సామ్రాజ్యవాద పోటీలో బ్రిటిష్ ప్రత్యర్థి అయిన ఫ్రెంచ్ సైనికాధికారుల చేత ఆధునిక యుద్ధ విద్యల్లో టిపుకు శిక్షణ ఇప్పించాడు తండ్రి హైదర్. దాంతో 15 ఏళ్ల వయసు వచ్చే సరికి రాజ్య పాలనా వ్యవహారాల్లోనూ, యుద్ధాల్లోనూ తండ్రితోపాటు టిపు పాల్గొనడం ప్రారంభించాడు. 1766లో జరిగిన మొదటి మైసూర్ యుద్ధంలో తొలిసారి ప్రత్యక్షంగా పాల్గొన్నాడు. 1767లో జరిగిన కార్నాటిక్ యుద్ధంలో టిపు అశ్విక దళానికి స్వతంత్రంగా నాయకత్వం వహించాడు. 17 ఏళ్ల ప్రాయం వచ్చే సరికి ఆయనకు తండ్రి హైదర్ దౌత్య, సైనిక రంగాల్లో స్వతంత్ర బాధ్యతలు అప్పగించాడు. ఆ వయసులోనే ఆయన నిజాం నవాబు బ్రిటిష్ వారి పంచన చేరకుండా రాయభారం నడిపి విజయం సాధించాడు. దైత్యం నడపడంలో యువకుడైన టిపు చూపిన చాకచక్యానికి ముగ్ధుడైన నైజాం నబాబు టిపును 'ఫతే ఆలీ ఖాన్' బిరుదునిచ్చి సత్కరించాడు. యుద్ధాల్లో తండ్రికి కుడిభుజంగా మారి దక్షిణాదిలో అనేక చిన్న చిన్న రాజ్యాలను సొంతం చేసుకోవడంలో తోడ్పడ్డాడు. దాంతో హైదర్ ఆలి దక్షిణాదిలో అతి శక్తివంతుడైన రాజుగా మారాడు.



టిపు సుల్తాన్

## బ్రిటిష్ వారితో రాజీలేని పోరాటం

రాజ్యాన్ని విస్తరించుకోడానికీ, పటిష్ట పరుచుకోడానికీ లేదా ఆత్మ రక్షణకోసం పొరుగు రాజ్యాలతో యుద్ధాలు చేయడం రాచరికపు సహజ లక్షణం. టిపు కూడా దానికి అతీతుడేమీ కాదు. తండ్రి నుండి రాజ్యాధికారం పొందిన తరువాత టిపు అనేక యుద్ధాలు చేశాడు. తన రాజ్యాన్ని ఉత్తరాన కృష్ణా నది నుండి దక్షిణాన

దిండిగల్ వరకు సుమారు 650 కిలో మీటర్లు విస్తరించాడు. టిపు అధికారం చేపట్టగానే ఫ్రెంచ్ సహకారంతో సైనిక వ్యవస్థను ఆధునీకరించాడు. సైనిక వ్యూహాల్లో అనేక కొత్త పద్ధతులు ప్రవేశపెట్టాడు. ఆనాడు యూరప్‌లో కూడా లేని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేశాడు. శత్రువుపై మెరుపు వేగంతో దాడులు చేయడంలోనూ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించడంలోనూ సైన్యానికి తర్ఫీదు ఇచ్చాడు. "టిపు సైన్యం ప్రపంచంలోనే అత్యుత్తమ సైన్యాలలో ఒకటి" అని ఆయనతో పోరాడిన బ్రిటిష్ జనరల్ లార్డ్ కార్న్‌వాలిస్ పేర్కొన్నాడు. "ఆసియాలోని ఇతర సైన్యాలకన్నా టిపు సైన్యం చాలా ఉన్నత మైనది" అని మరో బ్రిటిష్ సైనికాధికారి కాంప్‌బెల్ పేర్కొన్నాడు.

ఆసియాలో వాణిజ్యం కోసమే కాకుండా యుద్ధావసరాల కోసం యుద్ధ నౌకలను నిర్మించిన మొట్ట మొదటి పాలకుడు టిపు సుల్తాన్. యుద్ధ రంగంలో నౌకల వినియోగం కోసం ఆయన ప్రత్యేకంగా ఒక కళాశాల ఏర్పాటు చేశాడు. ప్రసిద్ధ వ్యాపార కేంద్రమైన భట్‌కల్ వద్ద ఆయన 1993లో నేవల్ కాలేజీ ప్రారంభించాడు.

బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీని భారత దేశం నుండి తరిమేయడమే ఏకైక లక్ష్యంగా ఆయన అనేక యుద్ధాలు చేశాడు. వాటిని ఆంగ్లో-మైసూరు యుద్ధాలు లేక మైసూరు యుద్ధాలు అని పేర్కొంటున్నారు. తండ్రి హైదర్ ఆలితో కలిసి రెండు, ఆయన మరణించిన తరువాత రెండు మొత్తం నాలుగు మైసూరు యుద్ధాల్లో టిపు పాల్గొన్నాడు.

బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా స్వదేశంలోని ఇతర రాజ్యాలను కలుపుకు పోడానికి టిపు అనేక ప్రయత్నాలు చేశాడు. 17వ ఏటనే ఆయన నైజాం నవాబు వద్దకు జయప్రదంగా రాయబారం నిర్వహించాడు. అయితే టిపు అధికారం చేపట్టిన తరువాత మైసూరు రాజ్యం బలపడడం చూసి నైజాం నబాబు, మరాఠా రాజులు టిపు మీద కక్షగట్టారు. మైసూరుకు వ్యతిరేకంగా బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీతో చేతులు కలిపారు. నిజానికి ఈ రెండు రాజ్యాలు బ్రిటిష్ వారితో చేతులు కలపకపోయి ఉంటే భారత దేశంలో బ్రిటిష్ వాళ్లు నిలదొక్కుకుని ఉండేవారు కాదనీ, అప్పుడు దేశం పరిస్థితి మరోలా ఉండేదని అనేక మంది చరిత్రకారుల అభిప్రాయం.

## మొదటి మైసూరు యుద్ధం

1766లో జరిగిన మొదటి మైసూరు యుద్ధంలో టిపు తన తండ్రి హైదర్ ఆలీతో కలిసి పాల్గొన్నాడు. అప్పటికి ఆయన వయసు 17 సంవత్సరాలు. ఈ యుద్ధం మూడేళ్ల పాటు జరిగింది. బ్రిటిష్ వాళ్లనే కాకుండా వారితో చేతులు కలిపిన నైజాం,




కర్నాటక లోని దేవనహళ్లిలో టిపు సుల్తాన్ జన్మించిన స్థలం

మరాఠా పాలకులతో యుద్ధం జరిగింది. యుద్ధంలో మైసూరు సేనలు దక్షిణ భారత దేశంలో బ్రిటిష్ ప్రధాన కేంద్రమైన మద్రాసుకు 5 కిలోమీట్ల దూరం వరకు జైత్రయాత్ర సాగించాయి. దాంతో బ్రిటిష్ సైన్యం కకావికలమైంది. ఈ పరిణామాలతో ఇంగ్లండులో బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీ ప్రతిష్ట బాగా దిగజారిపోయింది. షేర్ మార్కెట్‌లో దాని షేర్ల విలువ కుప్పకూలిపోయింది. ఈ పరాజయంతో బ్రిటిష్ అధికారులు 1769లో మైసూరు రాజుతో సంధి చేసుకున్నారు. సంధి ప్రకారం మైసూరు రాజ్యం మీద ఇతరులెవరైనా దాడి చేస్తే ఈస్టిండియా కంపెనీ సేనలు మైసూరు పక్షానచేరి పోరాడాలి.

## రెండవ మైసూరు యుద్ధం

ఈ యుద్ధం 1780 నుండి 1784 వరకు నాలుగేళ్ల పాటు జరిగింది. మైసూరు రాజ్య 'సంరక్షణ' కింద ఉన్న 'మహె' ను 1779లో బ్రిటిష్ వాళ్లు స్వాధీనం చేసుకోవడంతో వారిపై టిపు, ఆయన తండ్రి హైదర్ దాడికి దిగారు. బ్రిటిష్ వారిని మంద్రాసు నుండి పూర్తిగా తరిమేయాలన్న లక్ష్యంతో హైదర్ ఆలీ 'కార్నాటిక్' మీద (తమిళనాడు, దక్షిణాంధ్ర ప్రాంతాలు) దాడికి దిగాడు. ఈ యుద్ధం సందర్భంగా 1789 సెప్టెంబర్‌లో టిపు సుల్తాన్ 10,000 మంది సైనికులను, 18 ఫిరంగులను తీసుకుని కల్నల్ బెయిలీ నాయకత్వంలోని బ్రిటిష్ సైన్యం మీద దాడి చేశాడు. మైసూరు సైన్యంతో యుద్ధం చేస్తున్న హెక్టర్ మున్రో సైన్యంతో కలవడానికి బెయిలీ వెళుతున్నాడు. పొల్లిలూరు వద్ద జరిగిన యుద్ధంలో టిపు సైన్యం బెయిలీ సేనలను ఓడించింది. నాలుగు వేలమందికి పైగా బెయిలీ సైన్యంలో 200 మంది యూరోపియన్ సైనికులను టిపు సైన్యం పట్టుకుంది. బ్రిటిష్ సైన్యంలో నియమించబడిన భారతీయ సిపాయిల్లో అనేక మంది చనిపోయారు. బెయిలీ సైన్యంతో కలుసుకోడానికి మున్రో ప్రత్యేక సైన్యంతో వస్తున్నవాడు కాస్తా ఈ ఓటమి వార్త వినడంతోనే కాంచీపురం

చెరువులో ఆయుధాలు పారేసి పరారయ్యాడు. తరువాత 1782లో తంజావూరుకు దగ్గరలోని అన్నాగుడి వద్ద టిపు సైన్యం కల్నల్ బ్రైత్‌వైట్ నాయకత్వంలోని బ్రిటిష్ సైన్యాన్ని ఓడించి ఆయుధాలను స్వాధీనం చేసుకున్నది. ఓడిపోయిన సైన్యం మొత్తాన్ని యుద్ధ ఖైదీలుగా పట్టుకున్నారు. 1781 డిసెంబర్‌లో టిపు చిత్తూరును బ్రిటిష్ వారి నుండి స్వాధీనం చేసుకున్నాడు. మొత్తం మీద ఈ యుద్ధాల్లో టిపు సుల్తాన్ మంచి సైనిక ప్రావీణ్యం సంపాదించాడు.

రెండవ మైసూరు యుద్ధం మధ్యలోనే 1782 డిసెంబర్ 6న టిపు తండ్రి హైదర్ ఆలీ మరణించాడు. దాంతో 1782 డిసెంబర్ 22న టిపు సుల్తాన్ మైసూరు రాజ్య సింహాసనాన్ని అధిష్టించాడు. వెనువెంటనే ఆయన బ్రిటిష్ వారిని నిలువరించడం కోసం మరాఠాలతోనూ, మొఘల్ రాజులతోనూ, మాధవజీ సింధియాతోనూ కూటమి నిర్మించడానికి ప్రయత్నించాడు. కానీ మైసూరు బూచిని చూపించి బ్రిటిష్ అధికారులు ఈ కూటమిని విచ్ఛిన్నం చేశారు. అయినా టిపు సుల్తాన్ బ్రిటిష్ వారితో రాజీలేని పోరాటం సాగించాడు. 1783లో జరిగిన యుద్ధంలో బ్రిటిష్ సైనికాధికారి బ్రిగేడియర్ మాథ్యూను బంధించాడు. మైసూరు సేనల ధాటిని ఎదుర్కోలేక బ్రిటిష్ వాళ్లు టిపు సుల్తాన్‌తో 1784లో మంగుళూరులో సంధి చేసుకున్నారు. దాంతో రెండో మైసూరు యుద్ధం ముగిసింది.

## ఇతర యుద్ధాలు

ఒకవైపు ఆంగ్లేయులతో యుద్ధాలు చేస్తూనే మరోవైపు పొరుగున ఉన్న మరాఠా, మలబార్ రాజులు బ్రిటిష్ వారి పంచన చేరడంతో వారితో కూడా టిపు యుద్ధాలు చేయాల్సి వచ్చింది. టిపు రాజ్యాధికారం చేపట్టిన తరువాత మరాఠాలతో ఆరు ప్రధాన యుద్ధాలు చేశాడు. పీష్వా మాధవరావు1 నాయకత్వంలో మరాఠా సామ్రాజ్యం భారత ఉపఖండంలోని చాలా ప్రాంతాలకు విస్తరించింది. మరాఠాలు టిపు తండ్రి హైదర్ ఆలీని 1764, 1767లో రెండుసార్లు ఓడించారు. 1767 యుద్ధంలో మరాఠా సైన్యం మైసూర్ రాజ్యం రాజధాని నగరమైన శ్రీరంగపట్నం లోకి ప్రవేశించింది. హైదర్ ఆలీ ఓటమిని అంగీకరించి మరాఠాలకు కప్పం చెల్లించడానికి అంగీకరించాడు. అయితే టిపు అధికారం లోకి వచ్చిన తరువాత మరాఠాల ఆధిపత్యాన్ని అంగీకరించలేదు. కప్పం కట్టడం ఆపేశాడు. దాంతో మరాఠా–మైసూర్ యుద్ధాలు జరిగాయి. 1785 ఫిబ్రవరిలో నార్గుండ్ ముట్టడిలో మైసూరు విజయం సాధించింది. 1786 మే, బదామీ ముట్టడిలో మైసూరు సేనలు ఓడిపోయాయి. 1786 జూన్, ఆదోని ముట్టడిలో మైసూరు సేనలు గెలిచాయి. అదే నెలలో గజేంద్రఘడ్ వద్ద జరిగిన యుద్ధంలో మరాఠాలు గెలుపొందారు. అదే ఏడాది

అక్టోబర్‌లో సావనూర్ వద్ద జరిగిన యుద్ధంలో మైసూరు గెలుపొందింది. 1787 జనవరిలో బహదూర్ బెండ ముట్టడిలో మైసూరు విజయం సాధించింది. అయితే 1787లో గజేంద్రఘడ్‌లో టిపు మరాఠాలతో సంధి చేసుకోవడంతో ఈ యుద్ధం ముగిసింది. ఈ సంధి ప్రకారం తండ్రి ఆమోదించిన కప్పం కట్టడానికి టిపు అంగీక రించగా, టిపుకు నవాబ్ టిపు సుల్తాన్ ఫతే ఆలీ ఖాన్' అని పిలవడానికి మరాఠా రాజు అంగీక రించాడు.



టిపు సుల్తాన్ ఖడ్గం

## మలబారుపై దాడులు

మరాఠాలతోబాటు ట్రావెన్‌కోర్ రాజులు కూడా మైసూరుకు వ్యతిరేకంగా బ్రిటిష్ వారితో చేతులు కలిపారు. 1766లో మలబారును ఆక్రమించుకోడానికి హైదర్ ఆలీ చేసిన యుద్ధంలో 15 ఏళ్ల టిపు సుల్తాన్ తొలిసారి పాల్గొన్నాడు. తెల్లిచెర్రిని స్వాధీనం చేసుకున్న తరువాత హైదర్ ఆలీ క్రమంగా మలబార్‌పై పట్టు కోల్పోతూ వచ్చాడు. మలబార్‌పై తిరిగి పట్టు సాధించడం కోసం 1789లో టిపు సుల్తాన్ మళ్లీ దాడి మొదలు పెట్టాడు. రెండేళ్ల పాటు నెడుంకొట్ట వద్ద జరిగిన యుద్ధంలో టిపుకు ట్రావన్‌కోర్ సైన్యం నుండి గట్టి ప్రతిఘటన ఎదురైంది. ఈ లోగా వర్షాలు ప్రారంభం కావడం, శ్రీరంగపట్నం మీదకు బ్రిటిష్ వారు దాడికి వస్తున్నారని తెలియడంతో టిపు సుల్తాన్ మలబార్‌ను విడిచిపెట్టి వెనక్కు మళ్లాడు.

## ఓటములు

మొదటి, రెండవ మైసూర్ యుద్ధాల్లో విజయం సాధించిన మైసూర్ సైన్యం మూడు, నాలుగు యుద్ధాల్లో ఓటములు చవి చూసింది. (కేరళలోని) ట్రావెన్‌కోర్ మహరాజు కోచి లోని రెండు డచ్ కోటలను ఆక్రమించడంతో టిపుకూ ట్రావెన్‌కోర్ మహరాజుకు మధ్య వివాదం చెలరేగింది. 1789 డిసెంబర్‌లో టిపు పెద్ద సైన్యంతో ట్రావెన్‌కోర్ మీద దాడి చేశాడు. టిపు సుల్తాన్‌ను ఓడిస్తేనే గాని తాము భారత దేశంలో నిలదొక్కుకోలేమని భావించిన బ్రిటిష్ వాళ్లు ట్రావెన్‌కోర్ రాజుకు మద్దతుగా రంగ ప్రవేశం చేశారు. మరాఠా రాజులనూ, నైజాం నవాబునూ, అనేక చిన్న రాజ్యాలు, పాలెగాళ్లనూ కూడగట్టి మైసూర్‌పై యుద్ధానికి దిగారు. ఈ విధంగా మూడో మైసూరు

యుద్ధం ప్రారంభమై రెండు సంవత్సరాలు సాగింది. ఈ యుద్ధంలో తొలుత బ్రిటిష్ సైన్యం అనేక పరాజయాలు చవిచూసింది. దాంతో ఈస్టిండియా కంపెనీ సేనాని లార్డ్ కార్న్‌వాలిస్ స్వయంగా బ్రిటిష్ సేనలకు నేతృత్వం వహించి యుద్ధానికి దిగాడు. 1790లో కంపెనీ సైన్యం ముందుకు పురోగమించి కోయంబత్తూరులో అత్యధిక భాగాన్ని స్వాధీనం చేసుకుంది. టిపు ప్రతిదాడి జరిపి కోయంబత్తూరు పట్టణం మినహా మిగతా ప్రాంతాన్ని స్వాధీనం చేసుకున్నాడు. ఈలోగా ఫ్రెంచ్ వారి సహకారం తీసుకోడానికి టిపు విశ్వ ప్రయత్నాలు చేశాడు. కానీ నెపోలియన్ సేనలు యూరప్‌లో పీకల్లోతు యుద్ధాల్లో మునిగిపోవడంతో టిపుకు సహకారం అందించలేకపోయింది. ఒట్టమన్ రాజు సహాయం కోసం కాన్‌స్టాంటినోపుల్‌కు దూతను పంపాడు. అయితే రష్యాతో యుద్ధంలో బ్రిటిష్ సహకారం ఆశిస్తున్న ఒట్టమన్ రాజు టిపుకు మద్దతుగా ముందకు రాలేదు. ఆఫ్ఘన్ పాలకుల సహకారం పొందడానికి కూడా టిపు విఫల యత్నం చేశాడు. 1791లో ఒకవైపు కార్న్‌వాలిస్ నాయకత్వంలోని బ్రిటిష్ కంపెనీ సైన్యం, మరోవైపు స్వదేశీ రాజులు మైసూరును చుట్టుముట్టారు. టిపు ప్రమాదంలో పడ్డాడు. కార్న్‌వాలిస్ సేనలు బెంగళూరును స్వాధీనం చేసుకుని రాజధాని శ్రీరంగపట్నం వైపు పురోగమించడం ప్రారంభించింది. టిపు శత్రువును గుక్క తిప్పుకోకుండా చేసే వ్యూహాన్ని అనుసరించి బ్రిటిష్ సైన్యానికి సరఫరాలు అందకుండా చేశాడు. దాంతో కార్న్‌వాలిస్ బెంగళూరుకు ఉపసంహరించుకున్నాడు. వెనువెంటనే టిపు సుల్తాన్ కోయంబత్తూరుకు సైన్యాన్ని పంపి తాను కోల్పోయిన భూభాగాన్ని తిరిగి స్వాధీనం చేసుకున్నాడు.

1772లో టిపుపై శత్రువులు బెంగళూరు నుండి, బొంబాయి నుండి పకడ్బందీగా దాడి చేశారు. రెండు వారాలు శ్రీరంగపట్నాన్ని ముట్టడించారు. తప్పని పరిస్థితుల్లో టిపు సుల్తాన్ బ్రిటిష్ వారితో సంధి చేసుకున్నాడు. ఆయన తన రాజ్యంలోని సగభాగం విజేతలకు ఇచ్చేట్లు, యుద్ధ నష్టపరిహారం కింద 3 కోట్ల 30 లక్షల రూపాయలు చెల్లించేట్లు షరతు పెట్టారు. రెండు దఫాలుగా ఆయన ఈ మొత్తం చెల్లించేవరకు ఆయన ఇద్దరు కుమారులను బంధీలుగా మద్రాసు తీసుకుపోయారు.

### నాల్గవ మైసూరు యుద్ధం - టిపు మరణం

ఓటమితో దెబ్బతిని ఉన్న టిపును శాశ్వతంగా అంతం చేయకపోతే తమకు భద్రత ఉండదని బ్రిటిష్ వారితోబాటు, అనేక మంది స్వదేశీ సంస్థానాధీశులు, పాలెగాళ్లు భావించారు. భారత దేశంలో తాము వేళ్లూనుకోవడం టిపు మరణం తరువాతనే జరుగుతుందని ఈస్టిండియా కంపెనీ అధికారులు బలంగా భావించారు. అందువల్ల టిపును నిర్ణయాత్మకంగా ఓడించి అంతం చేయడానికి సన్నాహాలు మొదలు



శ్రీరంగపట్నంలోని టిపు సుల్తాన్ వేసవి విడిది గృహం దరియా దౌలత్ భాగ్

పెట్టారు.

టిపుకు కూడా ఈ విషయాలు తెలుసు. అందువల్ల ఆయన కూడా తగిన సన్నాహాలు చేసుకున్నాడు. బ్రిటిష్ వారితో యుద్ధంలో స్వదేశీ సంస్థానాధీశుల మద్దతు పొందలేకపోయిన టిపు సుల్తాన్ విదేశాల నుండి ముఖ్యంగా బ్రిటిష్‌కు వ్యతిరేకంగా ఉన్న ఫ్రాన్స్ నుండి ఇతర దేశాల నుండి మద్దతు పొందడానికి తీవ్రంగా ప్రయత్నించాడు. ఫ్రెంచ్ పాలకుడు నెపోలియన్, ఒట్టమన్ చక్రవర్తి, ఒమన్ సుల్తాన్, జాండ్ పాలకులు, ఆఫ్ఘనిస్తాన్‌లో దుర్రానీ చక్రవర్తి వద్దకు దూతలను పంపించి మద్దతు కూడగట్టడానికి ప్రయత్నించాడు.

ఫ్రెంచ్ పాలకుడు నెపోలియన్ బోనపార్టి, బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా టిపు సుల్తాన్‌తో పొత్తు పెట్టుకోడానికి అనేక విధానాల ప్రయత్నించాడు. టిపు సుల్తాన్ సేనలతో సంబంధాలు పెట్టుకుని బ్రిటిష్‌ను ఓడించడం కోసం బోనపార్టి ఈజిప్టుపై దాడి చేశాడు. ఈజిప్టును జయించిన వెంటనే టిపు సుల్తాన్‌తో సంబంధాలను పెట్టుకుని బ్రిటిష్ వారిమీద దాడి చేద్దాం అని నెపోలియన్ స్వయంగా చెప్పినట్లు టల్లెరాండ్ అనే ఆయన 1798 ఫిబ్రవరి 13 సమర్పించిన నివేదికలో పేర్కొన్నారు. "ఈజిప్టు మీద గెలవగానే టిపు సాహెబ్‌కు సాయంగా 15,000 సైన్యాన్ని భారత్‌కు పంపుతాను" అని నెపోలియన్ పేర్కొన్నట్లు ఆయన చెప్పారు. కానీ నెపోలియన్ అనుకున్నట్లు జరగకపోవడంతో టిపుకు సహాయం అందలేదు.

1798లో నైల్ యుద్ధంలో ఫ్రాన్స్ సైన్యాన్ని ఓడించిన బ్రిటిష్ సైన్యం కూడా మైసూరు మీదకు దాడికి దిగింది. మూడు వైపుల నుండి 26,000 మంది బ్రిటిష్ సైనికులు శ్రీరంగపట్నాన్ని ముట్టడించారు. ఈ యుద్ధంలో ఓటమిపాలైన టిపు తన సైన్యంతో సహా శ్రీరంగపట్నం కోటలోకి వెళ్లిపోయాడు. కోట గోడల నుండి బ్రిటిష్ సైన్యాన్ని తీవ్రంగా ప్రతిఘటించాడు. కోటగోడలు బద్దలుగొట్టడానికి బ్రిటిష్ సైన్యం శతవిధాలా ప్రయత్నించి విఫలమైంది. ఈ లోగా టిపు దివాన్ మీర్ సాధిక్ ద్రోహబుద్ధితో

బ్రిటిష్ వారికి కోటలోకి ప్రవేశించే మార్గం చూపించడంతో శత్రు సైన్యం శ్రీరంగపట్నం కోటలోకి ప్రవేశించింది. టిపు సహాయకులుగా ఉన్న ఫ్రెంచ్ సైనికాధికారులు కోటలోని రహస్య మార్గాలగుండా తప్పుకు పోవాలని టిపుకు సలహా ఇచ్చారు. వేరే కోటకు చేరుకుని అక్కడి నుండి బ్రిటిష్ వారిపై యుద్ధ చేయవచ్చునని చెప్పారు. అయితే పారిపోవడానికి టిపు అంగీకరించలేదు. "నక్కలాగా వందేళ్లు బతికే కన్నా సింహంలాగా ఒక్క రోజు బతికితే చాలు" అంటూ ఆయన శత్రువుల మీదికి ఉరికాడు. 1799 మే 4వ తేదీన 'మైసూర్ బెబ్బులి', భారత స్వాతంత్ర యోధుడు టిపు సుల్తాన్ శత్రువుల తుపాకి గుళ్లకు నేలకొరిగాడు.

టిపు మరణించిన కొద్ది గంటల తరువాత బ్రిటిష్ జనరల్ హారిస్ శ్రీరంగపట్న కోటలోపడి ఉన్న మృత దేహాల గుట్టల్లో టిపు దేహాన్ని గుర్తు పట్టిన వెంటనే "...ఇక ఇండియా మనదే" అని అరిచాడంటే భారత దేశాన్ని స్వాధీనం చేసుకోవాలన్న బ్రిటిష్ వారి ప్రయత్నాలకు టిపు ఎంతగా అడ్డుపడ్డాడో, ఆయన మరణం వారిని ఎంతగా ఆనంద పరిచిందో అర్థమవుతుంది. "భారత దేశ చరిత్రలో బ్రిటిష్ వారితో యుద్ధం చేస్తూ అమరుడైన ఏకైక భారతీయ హీరో టిపు సుల్తాన్" అని ప్రముఖ చరిత్ర కారుడు డాక్టర్ జయప్రకాష్ కీర్తించారు.

## సామాజిక సంస్కరణ వాది

టిపు సుల్తాన్ ఆ కాలంలోనే తన రాజ్యంలో అనేక సామాజిక సంస్కరణలు ప్రవేశపెట్టాడు. తన కాలంలోని సామాజిక పరిస్థితుల పట్ల టిపు సుల్తాన్ అసంతృప్తితో ఉండేవాడు. ఆయన కాలంలో కుల వ్యవస్థ ఘనీభవించి ఉండేది. వివిధ కులాల మధ్య తీవ్రమైన అసమానతలుండేవి. భూ సంబంధాలకు సంబంధించి జాగీర్దారీ వ్యవస్థ బలంగా ఉండేది. సమాజంలోని అసమానతల పట్ల టిపు వ్యాకులత చెందేవాడని ఆయన చెప్పిన మాటలు, ఆయన నిర్వహించిన కార్యకలాపాల వల్ల తెలుస్తుంది. మలబార్ ప్రాంతంలో మహిళలు ఛాతిని గుడ్డతో కప్పుకునేవారు కాదు. ఇది మహిళల గౌరవానికి విరుద్ధమని పేర్కొన్నాడు. మహిళలు నిండా గుడ్డ కప్పుకోవాలని ఆదేశించాడు. టిపు కాలంలో యూరప్ అంతటా ఫ్రెంచ్ విప్లవ పవనాలు బలంగా వీస్తుండేవి. అక్కడి పరిణామాలను ఆయన తెలుసుకుంటేండేవాడు. ఫ్రెంచ్ విప్లవ సందేశాలైన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం ఆయునను బాగా ఆకర్షించాయన్నదానికి శ్రీరంగపట్నంలో ఆయన నెలకొల్పిన 'జాకోబియన్ క్లబ్' నిదర్శనం. ప్రపంచంలో అందరికీ సమాన హక్కులుండాలని చెప్పేవాడు. జాకోబియన్ క్లబ్‌లో చేరిన టిపు తనను తాను "సిటిజన్ టిపు" గా, విప్లవకారునిగా పిలుచుకునేవాడు. 59 మంది ఫ్రెంచ్ సైనికులు, తనూ కలిసి 60 మందితో ఏర్పడిన జాకోబియన్



చామరాజ్‌పేట లోని కోట వెంకటరమణ దేవాలయం: టిపు సుల్తాన్ తరచూ దేవాలయాన్ని సందర్శించుకునే వాడు

క్లబ్‌లో రాజుతో సహా అందరూ సమానులే. ఫ్రెంచ్ రిపబ్లిక్ చట్టాల మాదిరి చట్టాలను రూపకల్పన చేయాలని జాకోబియన్ క్లబ్‌ను కోరాడు. ఫ్రెంచ్ స్నేహితుల ద్వారా ఆయన ఐరోపాలోని మూడు ఉద్యమాల గురించి తెలుసుకున్నాడు. అవి: ఇటలీలోని, సాంస్కృతిక పునరుజ్జీవనం (రినయజన్స్), జర్మనీలోని పునర్వ్యవస్థీకరణ (రిఫార్మేషన్), ఫ్రాన్స్‌లోని విప్లవం (రివల్యూషన్). ఈ ఉద్యమాల్లోని ముఖ్యమైన అంశాలను తన పరిపాలనలో అమలు చేయడానికి ఆయన ప్రయత్నించాడు.

అమెరికా స్వతంత్ర పోరాటం (1775-1783)లో ఫ్రెంచ్ వారి పాత్ర ఆయనను బాగా ఆకట్టుకున్నది. ఆ పోరాటంలో ఫ్రెంచ్‌వాళ్లు అమెరికా ప్రజల తరఫున పాల్గొని పోరాటం విజయం సాధించిన తరువాత తిరిగి స్వదేశానికి వచ్చేశారు. భారత దేశంలో కూడా ఫ్రెంచ్ వాళ్లు అదే విధంగా చేస్తారనే భావనతో టిపు బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా తను చేస్తున్న పోరాటానికి నెపోలియన్ బోనపార్టి మద్దతు కూడగట్టడానికి ప్రయత్నించాడు.

## పరమత సహనం

టిపు సుల్తాన్ ముస్లిం మతం పట్ల గట్టి నమ్మకం ఉన్న భక్తుడే అయినా ఇతర మతాల పట్ల సామరస్యాన్ని కోరుకునేవాడు. మతం విషయంలో ఆయన ఉదారవాద, లౌకిక వాద సాంప్రదాయాలు కొనసాగించేవాడు. దీనికి కారణం ఆయన సూఫీ మతావలంబి కావడమే. ఆయన సూఫీకి మతంలో చిస్టి సంప్రదాయానికి చెందినవాడు. టిపు సుల్తాన్ తన రాజ్యంలోని 156 దేవాలయాలకు భూములు దానం చేశాడు. ముఖ్యంగా ఆయన రాజధాని శ్రీరంగపట్నంలోని రంగనాథస్వామి దేవాలయానికి భూములు, అనేక కానుకలు సమర్పించాడు. 1782-1799 మధ్య

కాలంలో టిపు సుల్తాన్ తన రాజ్యంలోని దేవాలయాలకు భూములు దానమిస్తూ 34 'సనద్'లు (పట్టాలు), పెద్ద ఎత్తున ఆభరణాలు ఇచ్చారని మైసూర్ గజెట్ ఎడిటర్ రాశాడు. అనేక సార్లు బంగారు, వెండి పళ్లేలలో కానుకలు సమర్పించేవాడు. శ్రీరంగపట్నంలోని రంగనాథ ఆలయం టిపు నివసించే భవనానికి సమీపంలోనే ఉండేది. ఆయన ప్రతినిత్యం తన మహల్ నుండి మసీదులో మౌజిన్ చదివే నమాజుతోపాటు రంగనాథ గుడి గంటల శబ్దాలు కూడా అంతే గౌరవంతో వినేవాడు. కర్నాటకలోని నంజన్‌గుడి శ్రీకాంతేశ్వర దేవాలయానికి టిపు బహూకరించిన వజ్రకచితమైన కప్పు ఇప్పటికీ అక్కడ ఉంది. రంగనాథాలయానికి ఆయన పచ్చ రాతితో చేసి శివలింగాన్ని, ఏడు వెండి కప్పులు, హారతి పళ్లేలు బహూకరించాడు. ఇంకా అనేక దేవాలయాలకు ఆభరణాలు బహూకరించాడు.

1791లో టిపు సుల్తాన్‌కూ, మరాఠాలకూ మధ్య యుద్ధం జరుగుతున్న సమయంలో రఘునాథ్‌రావు పట్వర్ధన్ నాయకత్వంలో కొందరు మరాఠా సైనికులు గుర్రాల మీద వచ్చి శృంగేరి శంకరాచార్య మఠం, దేవాలయం మీద దాడికి తలపడి విధ్వంశం చేశారు. మఠంలోని బ్రాహ్మణులతో సహా అనేక మందిని చంపారు. పలువురు గాయపడ్డారు. మఠంలోని విలువైన వస్తువులను దోచుకుపోయారు. శారదా దేవి విగ్రహాన్ని ముక్కలు చేశారు. శంకరాచార్యుల వారు టిపు సుల్తాన్ సహాయం కోసం అర్జీ పెట్టుకున్నారు. ఈ విషయమై శంకరాచార్యులవారికీ, టిపు సుల్తానుకూ మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలు 30 వరకు మైసూర్ పురావస్తు శాఖలో 1916లో బయటపడ్డాయి. ఆ శాఖ డైరెక్టర్ వాటిని వెలికి తీశారు. మఠంపై దాడి వార్త విన్న టిపు సుల్తాన్ తీవ్ర విచారం, ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఇలా రాశాడు: "హసద్భిహి క్రియతే కర్మ రుదద్భిర్–అనుభుయతే (నవ్వుతూ పాపపు పనులు చేసేవారు వాటి పర్యవసానాలను ఏడుస్తూ అనుభవిస్తారు) అనే స్లోకాన్ని బట్టి ఇటువంటి పవిత్ర స్థలాలను అపవిత్రం చేసేవారు కలియగంలో అతి త్వరలోనే తమ తప్పులకు శిక్ష అనుభవిస్తారు" అని పేర్కొన్నాడు. శంకరాచార్యుల వారికి వెంటనే 200 ఫణాల డబ్బు, ఇతర బహుమతులు, వస్తువులు అందించాలని ఆయన బెద్నూర్ ఆసిఫ్‌ను ఆదేశించారు. ఆ తరువాత కూడా టిపు సుల్తాన్ శృంగేరి మఠంపై మిక్కిలి శ్రద్ధ వహించాడు. 1790 వరకు కూడా శంకరాచార్యులకు ఆయన లేఖలు రాస్తూనే ఉన్నాడు.

చామరాజ్‌పేటలోని కోటె వెంకటరమణ దేవాలయాన్ని టిపు సుల్తాన్ తరచూ సందర్శించుకుని దేవునికి మొక్కేవాడు. దానికి బలమైన కారణం ఉంది. మూడవ మైసూరు యుద్ధం జరుగుతుండగా బ్రిటిష్ వారు టిపుపై ఫిరంగులు పేల్చారు. ఆ

సమయంలో ఆయన దేవాలయం ఎదుట గల 80 అడుగుల రాతి ధ్వజస్తంభం వెనక దాక్కోవడంతో బ్రతికి బయటపడ్డాడు. టిపు వేసవి విడిది భవనం దరియా దౌలత్ భాగ్ ఈ దేవాలయానికి దగ్గరలోనే ఉండేది. ఆయన తరచూ దేవాలయానికి వచ్చి దండం పెట్టుకుని వెళ్లేవాడని చెబుతూ ఆ దేవాలయ అర్చకులు, అధికారులు నేటికీ దాన్ని మతసౌహార్ద్రతకు చిహ్నంగా భావిస్తుంటారు.



**టిపు సుల్తాన్ మంత్రివర్గంలో కీలక బాధ్యలు నిర్వహించిన కృష్ణమాచార్య పూర్ణయ్య**

## మంత్రులు, అధికారులుగా హిందువుల నియామకం

టిపు తన ప్రభుత్వంలోని అనేక ముఖ్య శాఖల్లో హిందూ అధికారులను నిమమించాడు. టిపు సుల్తాన్ కోశాధికారిగా కృష్ణారావు పనిచేసేవాడు. తపాలా, పోలీసు శాఖ మంత్రి శ్యామయ్య అయ్యాంగార్. ఈయన సోదరుడు రంగా అయ్యంగార్ కూడా ప్రభుత్వాధికారిగా ఉండేవాడు. మొఘల్ దర్బార్‌లో టిపు ముఖ్య దూతలుగా మూల్‌చంద్, సుజన్ రాయ్‌లు పనిచేసేవారు. ఆయన ముఖ్య పేష్కర్ సుబ్బారావు హిందువే. టిపు సుల్తాన్ తన రాజ్యంలోని అన్ని ప్రాంతాల్లోనూ న్యాయస్థానల్లో హిందూ, ముస్లిం న్యాయమూర్తులను నియమించాడు. ముస్లింలకు క్వాది, హిందువులకు పండిట్ న్యాయమూర్తులుగా ఉండేవారు. కేంద్ర న్యాయస్థానంలో కూడా ఇదే పద్ధతిలో నియామకాలు చేశాడు.

టిపు సుల్తాన్ సంస్థానంలో ప్రముఖ పాత్ర నిర్వహించిన కృష్ణాచార్య పూర్ణయ్య ప్రధానమైన 'మిర్ ఆసఫ్' (దివాన్) పదవీ బాధ్యతలు నిర్వహించాడు. టిపు తండ్రి హైదర్ ఆలి కింద పనిచేసిన పూర్ణయ్యను టిపు సుల్తాన్ తన ఆంతరంగికుల్లో ఒకడిగా తీసుకున్నాడు. టిపు సుల్తాన్ నాయకత్వంలో జరిగిన ప్రతి యుద్ధంలో పూర్ణయ్య పాల్గొన్నాడు. మూడవ మైసూరు యుద్ధంలో పూర్ణయ్య స్వయంగా ఒక రాకెట్ దళానికి నాయకత్వం వహించాడు. తన పెద్ద కొడుకు యోగక్షేమాలు చూసుకుని యోగ్యుణ్ని చేసే పనిని టిపు పూర్ణయ్యకు అప్పగించాడు.

## మైసూర్ రాకెట్లు

టిపు సుల్తాన్ సైన్యం ఆనాటికి బ్రిటిష్ వారివద్ద గానీ, మొత్తం యూరప్



**టిపు సుల్తాన్ ఉపయోగించిన తుపాకి (శ్రీరంగపట్నం 1792-93): ఆనాటికి అది అత్యంత ఆధునిక తుపాకి. యూరప్‌లోని అత్యంత ఆధునిక టెక్నాలజీతో టిపు తనకోసం దీన్ని ప్రత్యేకంగా తయారు చేయించుకున్నాడు.**

ఖండంలోగానీ లేని ఆధనిక రాకెట్లు ఉపయోగించింది. ఆయన సైన్యంలో రాకెట్‌లు ప్రయోగించే దళాన్ని కుషూన్స్ అనేవారు. వాస్తవానికి మైసూర్ రాకెట్‌లను టిపు తండ్రి హైదర్ ఆలీ హయాంలోనే అభివృద్ధి పరిచారు. టిపు అధికారంలోకి వచ్చాక వీటిని మెరుగుపరిచాడు. రాకెట్ సైనిక దళాలను 1500 నుండి 5000కు పెంచాడు. టిపు ఓడిపోయిన తరువాత బ్రిటిష్ వారు ఈ మైసూరు రాకెట్లను తీసుకుపోయి వాటిని మరింత మెరుగుపరిచి నెపోలియన్‌తో జరిగిన యుద్ధాల్లో ఉపయోగించారు. శ్రీరంగపట్నంలో దొరికిన రెండు రాకెట్లను బ్రిటిష్ రాయల్ సైనిక మ్యూజియంలో ఉంచారు. టిపు సైన్యానికి యుద్దంలో శత్రువు మీదికి రాకెట్లు ఎలా ప్రయోగించాలో శిక్షణ ఇచ్చేవారు. రాకెట్లకు రెండువైపులా పదునుగల బ్లేడులు ఉండేవి. ఒకే సారి అనేక రాకెట్లు శత్రువు మీదికి గురిచూసి వదిలితే అవి శత్రువుకు విపరీతమైన నష్టం కలిగించేవి. ఈ రాకెట్లు సుమారు 2 కిలోమీటర్లు ప్రయాణించి శత్రు సైన్యం మీద పడేవి.

## ఆర్థిక వ్యవస్థ

టిపు హయాంలో మైసూర్ రాజ్యం దేశంలోనే అత్యంత అభివృద్ధి చెందిన ప్రాంతంగా ఎదిగింది. హైదర్ ఆలీ అడుగుజాడల్లోనే టిపు సుల్తాన్ మైసూర్‌ను ఆర్థికంగా అభివృద్ధి చేసేందుకు అనేక చర్యలు తీసుకున్నాడు. వ్యవసాయం బాగా అభివృద్ధి చెందింది. జౌళి పరిశ్రమ కొత్త పుంతలు తొక్కింది. దాని వల్ల అప్పటికి దేశంలో ఆర్థికంగా అభివృద్ధి సాధించిన బెంగాల్‌ను మైసూర్ రాజ్యం మించిపోయింది. ఆనాటి సగటు భారతీయుల ఆదాయంతో పోలిస్తే మైసూర్ ప్రజల సగటు ఆదాయం అయిదు రెట్లు అధికంగా ఉండేది. కావేరీ నదిపై ప్రస్తుతం కృష్ణ రాజ సాగర్ ఆనకట్టగా పిలుస్తున్న కన్నంబడి ఆనకట్టకు టిపు సుల్తాన్ శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన ఫలకంపై ఆయన పేరు ఉంది. అయితే పలు కారణాల వల్ల ఆయన దాన్ని నిర్మించలేకపోయారు. 1938లో ఈ ఆనకట్ట నిర్మింబడింది. బెంగాల్‌లో పట్టు



**మైసూరు రాజ్యంలో టిపు సుల్తాన్ ప్రవేశ పెట్టిన రాగి పైసలు: ఒక్కో పైసా 23 గ్రాముల రాగితో తయారయ్యేది.**

పరిశ్రమను అధ్యయనం చేయడానికి ఆయన ఒక నిపుణుడిని అక్కడికి పంపాడు. మైసూర్‌లో పట్టు పరిశ్రమ అభివృద్ధి చేశాడు. 18వ శతాబ్దం చివరిలో యూరప్‌లోనే బ్రిటన్‌లో అత్యధిక జీవన ప్రమాణాలు, అత్యధిక నిజ వేతనాలు ఉండేవి. కానీ టిపు సుల్తాన్ హయాంలో మైసూర్ ప్రజల నిజవేతనాలు బ్రిటిన్‌ను మించిపోయాయి. ఆ రోజున భారత దేశంలో (1990 అంతర్జాతీయ డాలరు ప్రకారం) సగటు జీవన వ్యయం 400 డాలర్లు కాగా 1820లో నెదర్లాండ్స్‌లో 1,838 డాలర్లు, బ్రిటన్‌లో1,706 డాలర్లు ఉండేది. మైసూర్‌లో 2,000 డాలర్లు ఉండేది. రోడ్లు నిర్మించడంలో టిపు సుల్తాన్ అంతవరకు ఏ రాజూ చేయని కృషి చేశాడు. ముఖ్యంగా మలబార్ ప్రాంతంలో తన సైనిక దళాల ప్రయాణం కోసం పెద్ద ఎత్తున రోడ్డు నిర్మాణాలు చేపట్టాడు.

వాణిజ్యం, వ్యాపారంపై రాజ్యం అదుపు ఉండాలని ఆ కాలంలోనే టిపు చెప్పడమే కాకుండా ఆ విధానాన్ని అమలు చేయడానికి పూనుకున్నాడు. దీని కోసం ఆయన ఆనాడే ప్రభుత్వ వ్యాపార సంస్థ (స్టేట్ ట్రేడింగ్ కార్పొరేషన్) ఏర్పాటు చేశాడు. మైసూరు పట్టు పరిశ్రమను అభివృద్ధి చేయడం, మైసూరు రాష్ట్రంలోనే కాకుండా అనేక దేశాల్లో పారిశ్రామిక, వాణిజ్య కేంద్రాలు స్థాపించడం ఆనాడు చాలా ముందుచూపుతో కూడిన చర్యలు. విదేశాలకు ఎగుమతులను ప్రోత్సహించడం కోసం ఆయన ఆనాడు ఒక నౌకా స్థావరాన్ని నిర్మించాడు. టిపు తన రాజ్యంలో నూతన తరహా సహకార బ్యాంకులు ఏర్పాటు చేశాడు. ఇందులో ధనిక వర్గాల ప్రాబల్యం పెరిగిపోకుండా చూడ్డం కోసం ఎక్కువ మొత్తాలను బ్యాంకులో వాటాలు తీసుకుని పొదుపు చేసేవారికి లాభాల్లో వాటాను తగ్గించాడు. పేదలను పొదుపువైపుకు

ఆకర్షించేందుకు తక్కువ మొత్తాలు పొదుపు చేసేవారికి లాభాలు పెంచాడు. టిపు నాటి మైసూర్ రాజ్యంలో ప్రజలు మోసాలకు గురికాకుండా తూనికలు కొలతల వ్యవస్థను ఆధునీకరించాడు.

వ్యవసాయాభివృద్ధికి టిపు ప్రాధాన్యమివ్వడమే కాకుండా వ్యవసాయ రంగంలో అనేక పురోగామి సంస్కరణలు ప్రవేశ పెట్టాడు. జాగీర్దారీ వ్యవస్థను రద్దు చేసి రైతులకు భూమి మీద హక్కులు కల్పించాడు. వ్యవసాయాన్ని ప్రోత్సహించేం దుకుగాను బంజరు భూములను మాగాణులుగా మార్చే రైతులు మూడేళ్ల పాటు ఎటువంటి పన్నులు చెల్లించనక్కరలేదని రాయితీలు ప్రకటించాడు. పన్నుల వసూలుకు మధ్య దళారీలను తొలగించి ప్రభుత్వ ఉద్యోగులను నియమించాడు. వ్యవసాయ పనిముట్ల కొనుగోలుకు రైతులకు రుణ సదుపాయం కల్పించాడు. నీటిపారుదలకు అధిక ప్రాధాన్యమిచ్చాడు. దానిలో భాగంగానే కావేరీ నదిమీద ఆనకట్ట కట్టడానికి శంకుస్థాపన చేశాడు.

టిపు సుల్తాన్ తన రాజ్యంలో మద్యపానం, వ్యభిచారాలను చాలా కఠినంగా నిషేధించాడు. గంజాయి వినియోగాన్నీ, సాగునూ నిషేధించాడు.

## కొత్త నాణేలు

మైసూరు ప్రాంతంలో ప్రాచీన కాలం నుండి ఉన్న నాణేల స్థానంలో టిపు సుల్తాన్ కొత్త నాణేల వ్యవస్థను ప్రవేశపెట్టాడు. ఈ నాణేల వ్యవస్థ సంక్లిష్టంగా ఉండేది. ఈ ప్రాంతంలో మొట్టమొదట బంగారు నాణేలను 11వ శతాబ్దంలోనే ప్రవేశపెట్టారు. పగోడాల పేరుతో దక్షిణ భారత దేశంలో అవి తరువాతి కాలంలో కూడా కొనసాగాయి. బంగారు పగోడాల మీద ఏనుగు బొమ్మ ఉండేది. హైదర్ ఆలీ అధికారం చేపట్టాక పగోడాలను కొనసాగిస్తూనే బంగారు మొహర్లు, వెండి రూపాయలు ప్రవేశపెట్టాడు. ఇవి మొఘల్ చక్రవర్తి షా ఆలమ్ 2 పేరున ఉండేవి. టిపు సుల్తాన్ వీటిని కొనసాగిస్తూనే రాగితో చేసిన పెద్ద పైసాలను ప్రవేశ పెట్టాడు. ఈ విధంగా ఆయన రాజ్యంలో రాగి పైసాలు, వెండి రూపాయలు, బంగారు పగోడాలు చెలామణి అయ్యేవి. వీటిలో సగం, పావు, ఎనిమితో వంతు, 16వ వంతు పైసా, రూపాయి నాణేలు చెలామణిలో ఉండేవి.

## విదేశీ వ్యవహారాలు

బ్రిటిష్ వారిని భారత దేశం నుండి తరమాలన్న లక్ష్యంతో టిపు విదేశీ వ్యవహారాలు నడిపాడు. ఆయన దేశంలోని ఇతర రాజులతో సయోధ్యకు ఎంతగానో కృషి చేశాడు. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా స్వదేశీ సంస్థానాలను నిలపడానికి ప్రయత్నించినప్పటికీ మైసూర్ బలాన్ని చూసి ఈర్ష్య చెందిన స్వదేశీ రాజులు టిపుకు



రాకెట్ ప్రయోగిస్తున్న టిపు సైనికుడు: టిపు సుల్తాన్ సైన్యంలో 5000 మందితో ప్రత్యేకంగా రాకెట్ సైనిక దళం ఉండేది.

వ్యతిరేకంగా బ్రిటిష్ కంపెనీ సైన్యంతో చేతులు కలిపారు. దాని వల్ల మొత్తం భారత దేశం బ్రిటిష్ వారి చేతుల్లోకి వెళ్లిపోయింది. బ్రిటిష్‌కు వ్యతిరేకంగా అంతర్జాతీయంగా అనేక దేశాలతో టిపు దౌత్యం నిర్వహించాడు. ప్రధానంగా ఫ్రాన్స్‌లో చక్రవర్తి లూయిప్ 16తోనూ ఫ్రెంచ్ విప్లవానంతరం నెపోలియన్ బోనపార్టీతోనూ సంబంధాలు నెలకొల్పుకున్నాడు. టిపుకు సైనికంగానూ, సాంకేతికంగానూ ఫ్రాన్స్ అండదండ లందించింది. ఆఫ్ఘనిస్తాన్, ఒట్టమన్ టర్కీ, పర్షియా, ఒమన్‌లతో ఆయన దౌత్య సంబంధాలు నెరిపాడు.

## మైసూర్ పులి

టిపు సుల్తాన్‌ను 'మైసూర్ పులి' అని పిలిచేవారు. దీనికి సంబంధించి ఒక కథ ఉంది. ఆయన తన ఫ్రెంచ్ స్నేహితునితో కలిసి అడవిలో పులుల వేటకు వెళ్లాడు. అకస్మాత్తుగా పులి వారిపై దాడి చేసింది. అది ముందుగా ఫ్రెంచ్ వ్యక్తిపై దూకి అతన్ని చంపేసింది. దానిపై టిపు తుపాకి గురిపెట్టాడు గానీ అది పనిచేయలేదు. దాంతో ఆయన వెంటనే మొలలోని కత్తి బయటకు తీశాడు. అయితే అది నేలమీద పడిపోయింది. వెంటనే ఆయన ముందుకు దూకి కత్తిని ఒడుపుగా చేతులోకి తీసుకుని ఇంతలోనే ఆయనపైకి దూకిన పులిని పొడిచి చంపేశాడు. అప్పటి నుండి టిపును 'మైసూరు పులి' అని పిలవడం ప్రారంభించారు. టిపు కూడా పులిని తన పాలనకు చిహ్నంగా మార్చేసుకున్నాడు. చివరికి ఆయన ఫ్రెంచ్ ఇంజినీర్లను పిలిపించి తన రాజభవనంలో ఒక యంత్రపు పులిని ఏర్పాటు చేయించాడు. దాన్ని 'టిపు పులి' అని పిలుస్తున్నారు. లండన్‌లోని విక్టోరియా, ఆల్బర్ట్ మ్యూజియంలో దాన్ని ఇప్పటికీ ప్రదర్శిస్తున్నారు. టిపు తన భవనంలో ఎక్కడ చూసినా పులి తల, చర్మం, పులి బొమ్మలు, వస్తువులు ప్రదర్శించడమే కాదు ఆయన జెండాల మీద, ఆయుధాల మీద

కూడా పులి చిత్రాలు పెట్టాడు. "టిపు రాజభవనంలో అనేక విచిత్రమైన కత్తులు, చాకులు, తుపాకులు, పిస్తోళ్లు ఉండేవి. వాటికి అందమైన నగీషీలు చెక్కిన బంగారు, వెండి పిడులు, కవచాలు ఉండేవి. వాటిమీద పులి తలగానీ, పులి చారలుగానీ ఉండేవి..." అని చరిత్ర కారుడు అలెగ్జాండర్ బీట్సన్ రాశాడు.

శ్రీరంగపట్నంలో చివరి యుద్ధం సందర్భంగా టిపు వాడిన కత్తినీ, ఆయన ధరించిన ఉంగరాన్నీ బ్రిటిష్ సైనికాధికారులు యుద్ధంలో లభించిన గుర్తులుగా తీసుకుపోయారు. 2004 వరకు వాటిని లండన్‌లోని బ్రిటిష్ మ్యూజియంలో ప్రదర్శించారు. 2004 ఏప్రిల్‌లో జరిగిన ఒక వేలంలో విజయ్ మాల్య టిపు ఖడ్గాన్ని, ఇతర కొన్ని వస్తువులను పాడుకుని భారత దేశానికి తిరిగి తీసుకువచ్చాడు. 2013లో టిపుకు చెందిన మరో ఖడ్గాన్ని సోథెబే సంస్థ వేలం వేసింది. ఈ ఖడ్గంపై పులి చారికలు ఉండేవి. దీన్ని ఒక టెలిఫోన్ వ్యాపారి 98 వేల పౌండ్లకు పాడుకున్నాడు.

## ప్రజల హృదయాల్లో చెరగని ముద్ర

దేశం కోసం బ్రిటిష్ వారితో వీరోచితంగా పోరాడి యుద్ధ రంగంలోనే వీరమరణం పాలైన టిపు సుల్తాన్ కులమతాలకతీతంగా కన్నడిగులందరికీ వీరపురుషుడైనాడు. కన్నడంలో టిపు సుల్తాన్ మినహా మరే రాజు మీదా ప్రజలు జానపద పాటలు కట్టి పాడుకోలేదు. 1799లో టిపు చనిపోతే 1800 నుండే ఆయన వీరమరణంపై ప్రజలు అనేక పాటలు కట్టి పాడుకోవడం ప్రారంభించారు. లావణీల రూపంలో అవి నేటికీ ప్రజల నోళ్లలో నానుతున్నాయి. 19 శతాబ్ది చివర, 20వ శతాబ్దంలోనూ టిపుపై వేలాది నాటకాలు ప్రదర్శించారు. కథల పుస్తకాల్లోనూ, అమర్ చిత్రకథ కామిక్స్‌లోనూ టిపు వీర కార్యాలు కథావస్తువులు. టిపు జీవితం దేశ విదేశీ రచయితలు, సినిమా, టివి కళాకారులెందరికో కథావస్తువుగా మారింది. 1896లో ప్రముఖ నవలా రచయిత జి.ఎ. హెంటీ రాసిన "ది టైగర్ ఆఫ్ మైసూర్" నవలలో టిపు సుల్తాన్ పాత్ర ప్రధానమైనది. 1902లో ఆయన రాసిన "ఎట్ ది పాయింట్ ఆఫ్ బాయ్‌నెట్" నవలలో కూడా టిపు ప్రస్తావన వస్తుంది. ప్రముఖ సైన్సు రచయిత జూల్స్ వెర్న్ రాసిన "మిస్టీరియస్ ఐలాండ్"లో కేప్టెన్ నెమో పాత్రను టిపు మేనల్లుడుగా రచయిత అభివర్ణించాడు. సంజయ్ ఖాన్ నిర్మించిన "ది స్వార్ట్ ఆఫ్ టిపు సుల్తాన్" టివి సీరియల్ భారత దేశమంతటా బాగా ప్రాచుర్యం పొందింది. 1990లో ప్రారంభమైన సీరియల్ 60 ఎపిసోడ్‌లు ప్రసారం అయింది. అంతకు ముందు దక్షిణ భారత భాషల్లో "ది ఎడ్వంచర్స్ ఆఫ్ టిపు సుల్తాన్' పేరుతో టివి సీరియల్ ప్రసారం అయింది. 1959లో టిపు జీవితం మీద ఒక సినిమాను కూడా నిర్మించారు. "టిపు సుల్తాన్" పేరుతో నిర్మితమైన ఈ చారిత్రక చిత్రంలో పైడి జయరాజ్ టిపు




పాత్రను పోషించారు. హిందీలో టిపు మీద అనేక నవలలు కూడా వచ్చాయి. చివరికి 1970లో ఆర్ఎస్ఎస్ ప్రచురించిన 'భారత భారతి' పుస్తకంలో కూడా టిపు సుల్తాన్‌ను కీర్తిస్తూ రాశారే గాని వ్యతిరేకంగా రాయలేదు.

## టిపుపై ఉద్ధేశపూర్వక వక్రీకరణలు

కానీ ఇటీవలి కాలంలో బిజెపి-ఆర్ఎస్ఎస్ తమ ముస్లిం వ్యతిరేక కళ్లద్దాల నుండి టిపును చూడ్డం ప్రారంభించారు. టిపును చంపి భారత దేశాన్ని పాలించడానికి నాటి ఈస్టిండియా కంపెనీకి ఒక సాకు కావాలి. అందుకే టిపు సుల్తాన్‌ను క్రూరమైన రాజుగా చిత్రీకరించడానికి అనేక మంది బ్రిటిష్ రచయితలు ప్రయత్నించారు. ఇటీవలి కాలంలో అధికారంలోకి వచ్చిన బిజెపి-ఆర్ఎస్ఎస్ ఈ బ్రిటిష్ రచయితల రాతలను పట్టుకుని టిపు సుల్తాన్‌ను హిందూ, క్రైస్తవ వ్యతిరేకిగా చిత్రీకరించడానికి ప్రయత్నిస్తున్నారు. అయితే ముస్లిం కానీ, హిందూ కానీ ఏ రాజు అయినా యుద్ధాల్లో కొత్త ప్రాంతాన్ని చేజిక్కించుకున్నప్పుడు ప్రజల మీద దాడులు చేయడం సాధారణమేనని చరిత్ర కారుడు బి.ఎ. సాలెటేర్ పేర్కొన్నాడు. టిపు సుల్తాన్ హిందూ ధర్మాన్ని పరిరక్షించాడని ఆయన చెప్పారు. టిపు సుల్తాన్ బ్రిటిష్ వారికి సింహస్వప్నంలా ఉండేవాడు గునుక ఆయనపై కక్షతో ఆనాటి బ్రిటిష్ రచయితలు ఆయన హిందూ, ముస్లిం మతస్తులను ఎంచుకుని చంపినట్లు రాశారని చరిత్రకారులు బ్రిటిల్ బాంక్,

హసన్, చెట్టి, ఇర్ఫాన్ హబీబ్, సాలెటేర్ మొదలైన వారు పేర్కొన్నారు. ముఖ్యంగా కిర్క్‌పాట్రిక్, మార్క్ విల్క్స్ అనే బ్రిటిష్ రచయితలు పనిగట్టుకుని టిపుకు వ్యతిరేకంగా రాశారని వారు పేర్కొన్నారు.

ఇటీవలికాలంలో కర్నాటకలోనూ, దేశవ్యాపితంగానూ బిజెపి–ఆర్‌ఎస్‌ఎస్ పరివారం నాటి బ్రిటిష్ రచనల్లోని వక్రీకరణలు, తప్పుడు సమాచారాన్ని స్వీకరించి టిపుపై ద్వేషాన్ని రెచ్చగొట్టడానికి ప్రయత్నిస్తున్నాయి. ఈ క్రమంలో ఆర్‌ఎస్‌ఎస్ మేధావులు అనేక అసత్య ప్రచారాలు కూడా చేస్తున్నారు. దీనికి ఒక ఉదాహరణ, కలకత్తా విశ్వ విద్యాలయం సంస్కృత విభాగం అధిపతి డాక్టర్ హర ప్రసాద్ శాస్త్రి ప్రచారంలో పెట్టిన విషయం. టిపు సుల్తాన్ బలవంతపు మతమార్పిడులకు పాల్పడేవాడని, దీనికి ఇష్టపడని 3000 మంది బ్రాహ్మణులు ఆత్మహత్యలు చేసుకున్నారని ఒక కథనం ప్రచారంలో ఉంది. ఆర్‌ఎస్‌ఎస్ వారు దీన్ని పనిగట్టుకుని ప్రచారం చేస్తారు. అయితే దీన్ని వారు ఎక్కడి నుండి తీసుకున్నారంటే.. కలకత్తా విశ్వ విద్యాలయం మెట్రిక్యులేషన్ చరిత్ర పుస్తకం నుండి. ఆ పుస్తకం రాసింది హర ప్రసాద్ శాస్త్రి. స్వాతంత్ర్య పూర్వం ఈ పుస్తకం బెంగాల్, అస్సాం, ఉత్తర ప్రదేశ్, మధ్య ప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల్లోని ఉన్నత పాఠశాల విద్యార్థుల చరిత్ర పాఠ్య గ్రంథంగా చాలా కాలం చెలామణి అయింది. ఈ విషయం 1928–29 సంవత్సరంలో ప్రఖ్యాత చరిత్ర పరిశోధకుడు డాక్టర్ బి.ఎస్. పాండే దృష్టికి వచ్చింది. ఆయన తరువాత పార్లమెంటు సభ్యునిగా, రాజస్థాన్ గవర్నర్‌గా పనిచేశారు. “టిపు సుల్తాన్ మత విధానం” అన్న అంశం మీద పరిశోధన చేస్తున్న పాండేకి టిపు సుల్తాన్ పరమత సహనం పాటించాడనీ, లౌకిక భావజాలం గలవాడనీ నిరూపించే అనేక ఉదాహరణలు లభించాయి. మరి అలాంటప్పుడు టిపు మతాంతీకరణ చేశాడనడం, 3000 మంది బ్రాహ్మణులు ఆత్మహత్యలు చేసుకున్నారనడం ఆశ్చర్యం కలిగించింది. దాంతో ఆయన ఈ విషయం మీద దృష్టి సారించాడు. తను పాఠ్య పుస్తకంలో రాసిన సమాచారానికి ఆధారాలు ఏమిటో తెలపాలని ఆయన డాక్టర్ హరప్రసాద్ శాస్త్రికి చాలా ఉత్తరాలు రాశాడు. ఎన్ని ఉత్తరాలు రాసినా శాస్త్రి నుండి సమాధానాలు రాలేదు. చివరికి తన ప్రశ్నకు సమాధానం చెప్పకపోతే శాస్త్రి మేధోపరమైన వంచనకు పాల్పడినట్లు పరిగణించాల్సి వస్తుందని హెచ్చరిక చేస్తూ ఉత్తరం రాశాడు. దాంతో శాస్త్రి స్పందించి దీనికి సంబంధించిన వివరాలు మైసూర్ గెజెట్‌లో ఉన్నాయని చిన్న మాట రాసి పంపించాడు. దాంతో డాక్టర్ పాండే మైసూర్ గెజెట్‌లో ఈ సామచారం కోసం పరిశోధించాడు. మైసూర్ చరిత్రమీద నిష్ణాతులైన ప్రొఫెసర్ శ్రీకాంతయ్యనూ, బ్రిజేంద్రనాథ్ సీల్‌లను ఆయన ఈ విషయమై సంప్రదించాడు. దీనిపై ప్రొఫెసర్



మ్యూజియంగా అభివృద్ధి పరిచిన టిపు సుల్తాన్ సమాధి: లోపల టిపు, ఆయన తండ్రి హైదర్ ఆలి సమాధులు

శ్రీకాంతయ్య డాక్టర్ పాండేకు ఉత్తరం రాస్తూ "3000 మంది బ్రాహ్మణులు ఆత్మహత్యలు చేసుకున్న ఘటన ఏదీ మైసూర్ గెజెట్‌లో ఎక్కడా లేదు. మైసూరు చరిత్రలో అటువంటి ఘటన ఏదీ జరగలేదని మైసూర్ చరిత్ర విద్యార్థిగా నేను ఘంటాపథంగా చెప్పగలను" అని పేర్కొన్నారు. (బిఎన్ పాండే రాసిన 'ఔరంగజేబ్–టిపు సుల్తాన్' పుస్తకం 14వ పేజీలో). టిపు లౌకిక వాది అని నిరూపించే అనేక పత్రాలను శ్రీకాంతయ్య తరువాత పాండేకు పంపారు. ఈ వాస్తవాలన్నిటినీ క్రోడీకరించి ప్రొఫెసర్ పాండే కలకత్తా విశ్వ విద్యాలయంలోని శాస్త్రికి పంపారు. శాస్త్రి నుండి ఎటువంటి సమాధానం రాకపోవడంతో ఇది ఉద్దేశపూర్వకంగా శాస్త్రి సృష్టించిన కట్టు కథ అని పాండే తేల్చుకుని ఈ విషయమై కలకత్తా విశ్వవిద్యాలయం వైస్–ఛాన్సలర్‌కు విపులంగా లేఖ రాశారు. దాన్ని పరిశీలించిన వైస్–ఛాన్సలర్ పాఠ్య పుస్తకాల నుండి శాస్త్రి కట్టుకథలను తొలగించారు. అయితే అప్పటికే ఈ ప్రచారం బాగా ప్రజల్లోకి వెళ్లిపోయింది. ఆర్ఎస్ఎస్ వాళ్లు దీన్ని పట్టుకుని పెద్ద ఎత్తున ప్రచారం చేస్తుంటారు.

అయితే టిపు సుల్తాన్ యుద్ధాల సందర్భంగా మలబార్‌లోని హిందువులపైనా, కూర్గ ప్రజలపైనా, మంగుళూరులో క్రైస్తవులపైనా దాడులు చేశాడు. వారిపై క్రూరంగా వ్యవహరించిన ఘటనలూ ఉన్నాయి. అయితే అవి రాజకీయమైన ఘటనలే గాని మతపరమైనవి కావు. బ్రిటిష్ వారితో చేతులు కలిపినందున మలబార్‌లో హిందువులపై కఠినంగా వ్యవహరించాడు. కూర్గ్ ప్రజల్లో బహుభర్తృత్వ ఆచారాన్ని టిపు నిషేధించినందుకు కూర్గులు ఎదురుతిరిగారు. వారిని క్రూరంగా అణచి వేశాడు. బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీతో చేతులు కలిపినందుకు అనేక క్రైస్తవ సమూహాలపై దాడులు చేసి అణచి వేశాడు. అయితే టిపు అనేక మంది ముస్లిం మపిల్లాలను

కూడా ఇంతే కఠినంగా అణచివేశాడు. ఆయన మలబార్‌లోని మప్పిల ముస్లింలను, మహదేవి ముస్లింలను కూడా చంపాడని రాశారు. టిపుకు వ్యతిరేకంగా వ్యవహరించిన కడప, కర్నూలు, సావనూర్ సంస్థానాలపై కూడా దాడి చేసి చాలా నిర్ధాక్షిణ్యంగా వ్యవహరించాడు. ఇవన్నీ మతపరమైన చర్యలు కావనీ, ఆనాటి పాలకులు జరిపిన రాజకీయ చర్యల్లో భాగమని ప్రొఫెసర్ పాండే రాశారు. నిజానికి ఏ మతానికి చెందిన పాలకులైనా ఇదే విధంగా వ్యవహరించారు. హిందూ రాజుల మధ్య యుద్ధాలు జరిగినప్పుడు ఓడిపోయిన వారిపై ఇటువంటి క్రౌర్యాలకే పాల్పడేవారు. ఇటువంటి ఘటనలను తీసుకుని టిపును మతోన్మాదిగా ప్రచారం చేయడం వెనుక ఆయన లౌకిక, పురోగామి భావజాల చరిత్రను, స్వాతంత్ర్య పోరాటంలో ఆయన చూపిన తెగువ, త్యాగాలను చెరిపి వేసే లక్ష్యం దాగి ఉంది. స్వాతంత్ర పోరాటంలో ఏమాత్రం పాల్గొనకుండా, విదేశీ సామ్రాజ్యవాదులకు సహకరించిన ఆర్‌ఎస్‌ఎస్ పరివారం ఎటువంటి ప్రచారం చేసినా చరిత్రలో టిపు సుల్తాన్ వీరోచిత, పురోగామి పాత్రను చెరిపివేయలేరు.

బ్రిటిష్ దాశ్య శృంఖలాల నుండి భారత దేశాన్ని విముక్తి చేయడానికి జరిగిన ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంలో ఝాన్సీ లక్ష్మీభాయి వీరోచితంగా పోరాడి ప్రాణాలర్పించింది. ఆమె కన్నా ఏడు దశాబ్దాల ముందు దేశ మాత విదేశీ ధాస్య శృంఖలాల్లోకి వెళ్లకుండా కాపాడేందుకు వీరోచితంగా పోరాడి నేలకొరిగాడు టిపు సుల్తాన్. ఇరువురూ రాచరిక పాలకులే అయినా భారత దేశం విదేశీ భానిసత్వంలోకి వెళ్లకుండా ఒకరు, విదేశీ బానిసత్వం నుండి విముక్తి కోసం మరొకరు పోరాడి అమరులైనారు. ఝాన్సీ లక్ష్మీభాయి మాదిరిగానే బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా పోరాడి నేలకొరిగిన అమరుడు టిపు సుల్తాన్ దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాడు.

భారత దేశంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదుల ఆధిపత్యానికి వ్యతిరేకంగా వీరోచితంగా పోరాడుతూ నేలకొరిగిన మొట్టమొదటి స్వాతంత్ర్య పోరాట యోధుడు టిపు సుల్తాన్. 1782లో తండ్రి హైదర్ ఆలి మరణంతో మైసూర్ రాజుగా పదవీ బాధ్యతలు స్వీకరించి 17 ఏళ్ల పాటు ప్రజారంజకంగానూ, బ్రిటిష్ ఈస్టిండియా కంపెనీని భారత భూభాగం నుండి తరిమికొట్టడమే లక్ష్యంగానూ పరిపాలన సాగించాడు. బ్రిటిష్ వారికి సింహస్వప్నమయ్యాడు. టిపు సుల్తాన్ యుద్ధ వీరుడే కాదు, మంచి పాలనా దక్షుడు, పలు భాషల్లో ప్రావీణ్యం కలిగిన మేధావి, కవి.

ఫ్రెంచ్ విప్లవంతో యూరప్‌లో వ్యాపించిన ఆధునిక లౌకిక భావజాలాన్ని భారత దేశంలో ప్రవేశపెట్టడానికి ప్రయత్నించిన మొదటి పాలకుడు టిపు సుల్తాన్. పరిపాలనా రంగంలో ఆయన తీసుకువచ్చిన సంస్కరణలు, ఆయన ప్రవేశ పెట్టిన ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, పారిశ్రామిక, వాణిజ్య రంగంలో తీసుకువచ్చిన ఆధునిక పోకడలు, యుద్ధ సాంకేతిక రంగంలో ఆయన తీసుకువచ్చిన విప్లవాత్మక మార్పులు మైసూరు రాజ్యాన్ని ఆనాడు భారత దేశంలోనే కాకుండా ప్రపంచంలోనే అత్యంత ఉన్నతమైన స్థానంలో నిలిపాయి.

బ్రిటిష్ దాశ్య శృంఖలాల నుండి భారత దేశాన్ని విముక్తి చేయడానికి జరిగిన ప్రథమ స్వాతంత్ర్య సంగ్రామంలో ఝాన్సీ లక్ష్మీభాయి వీరోచితంగా పోరాడి ప్రాణాలర్పించింది. ఆమె కన్నా ఏడు దశాబ్దాల ముందు దేశ మాత విదేశీ ధాస్య శృంఖలాల్లోకి వెళ్లకుండా కాపాడేందుకు వీరోచితంగా పోరాడి నేలకొరిగాడు టిపు సుల్తాన్. ఇరువురూ రాచరిక పాలకులే అయినా భారత దేశం విదేశీ భానిసత్వంలోకి వెళ్లకుండా ఒకరు, విదేశీ బానిసత్వం నుండి విముక్తి కోసం మరొకరు పోరాడి అమరులైనారు. ఝాన్సీ లక్ష్మీభాయి మాదిరిగానే బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు వ్యతిరేకంగా పోరాడి నేలకొరిగిన అమరుడు టిపు సుల్తాన్ దేశ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాడు.

PSBH
ప్రజాశక్తి బుక్‌హౌస్